


పూజలందుకోనుమా గణపయ్యా

నేడు వినాయకచవితి పర్వదినం ● వాడ వాడలా వేడుకలు





విగ్రహాలను ట్రాక్టర్లలో తీసుకొని సందడిగా వస్తున్న యువకులు

కడప కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తొలి పూజలందుకునే గణేశుడి పండుగ వచ్చేసింది. విఘ్నాలు తొలగింపచేసి విజయాలు అందించే భగవంతుడిగా భక్తులు పూజించే వినాయక చవితి పండుగను దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. గ్రామాలు, పట్టణాల వీధుల్లో లంబోధరుడి విగ్రహాలను ఏర్పాటుచేసి ఉత్సవాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి విగ్రహాలను నిమజ్జనం చేస్తారు.

మట్టి గణేశులు

పర్యావరణ హితాన్ని కాంక్షించే ప్రజలు వినాయకచవితి పర్వదినానికి మట్టితో రూపొందించిన వినాయకుడి విగ్రహాలను కొనుగోలు చేసి పూజించడం పరిపాటి. కొందరు తెలియక చూడగానే ఆకర్షించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో రూపొందించిన గణపయ్యలను కొనుగోలు చేసి పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్నారు. పర్యావరణవేత్తలు, ప్రభుత్వం మట్టి గణపతి విగ్రహాలను పూజించి తద్వారా పర్యావరణాన్ని కాపాడాలని ప్రచారం చేస్తోంది. కొంత మంది మట్టి గణపయ్య ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

నగరంలో భారీ విగ్రహాలు

రంగురంగుల మోడరన్ లుక్‌తో లంబోధరుడి ప్రతిమలు తయారుచేసి విక్రయిస్తున్నారు. కొన్ని చోట్ల వినాయకుడిని ధాన్యాలతో పండ్లతో కూరగాయలతో, ఇతర వస్తువులతో రూపొందించి అమ్మకాలు జరుపుతున్నారు. కడప నగరంలోని రాజీవ్‌పార్క్, ఎన్జీఓ కాలనీ, అప్సరా సర్కిల్, బ్లైండ్ హైస్కూల్, విజయదుర్గాదేవి కాలనీ తదితర ప్రాంతాలలో భారీ గణపయ్య విగ్రహాలను ఏర్పాటుచేశారు.



మట్టి విగ్రహాలను కొనుగోలుచేస్తున్న ప్రజలు



బుధవారం వినాయక చవితి పర్వదినం నిర్వహించేందుకు పూజకు కావలసిన సామగ్రిని మంగళవారం అమ్మకానికి తీసుకొచ్చారు. గణపయ్యకు అత్యంత ప్రీతికరమైన చెరకు గడలు, పండ్లు, అరటి పిలకలు, మామిడాకులు, యలక్కాయలు, గరిక, పూలు, తదితర సామగ్రి కొనుగోలుదారులతో జిల్లాలోని అన్ని పట్టణాలతో పాటు కడప నగర వీధులు కిటకిటలాడాయి. ఆ క్రమంలో నగర వన్‌టౌన్, రైతుబజార్, బీకేఎం స్ట్రీట్, పాతబస్టాండ్, ఏడురోడ్లు, యర్రముక్కపల్లె, ఆర్టీసీ బస్టాండ్, అప్సరా సర్కిల్, మహావీర్ సర్కిల్, వై జంక్షన్, కృష్ణాసర్కిల్, రాజీవ్ పార్క్ తదితర ప్రాంతాలలో విపరీతమైన రద్దీ కనిపించింది.

పూజా సామగ్రి కోసం



గణపయ్య విగ్రహాలకు డిమాండ్

చవితి పండుగ అంటేనే పిల్లలతో పాటు యువతకు భలే సంబరం. వాడ వాడలా, వీధివీధినా గణపయ్య విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ఉత్సాహం చూపుతుంటారు. ఆ క్రమంలో జిల్లా వ్యాప్తంగా, అలాగే కడప నగర శివార్లలో వినాయకుడి విగ్రహాల తయారీ కేంద్రాల నుంచి కొనుగోలు చేసి వాటిని ట్రాక్టర్లలో పెట్టుకుని కేకలు, ఈలలు వేస్తూ పీకలు ఊదుతూ సందడి వాతావరణంలో ఊరేగింపుగా తరలిస్తున్నారు. వాడవాడలా విగ్రహాలను ఏర్పాటు చేస్తుండడంతో విగ్రహాలకు డిమాండ్ పెరిగింది. అయినప్పటికీ కొనుగోలు చేసేవారు తగ్గేదేలే అంటూ బొజ్జ గణపయ్య విగ్రహాలను తరలించారు.



ప్రజలకు చవితి శుభాకాంక్షలు : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సుపరిపాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలు సంతృప్తి స్థాయిలో అందాలని, జిల్లా ప్రజలకు పరిపూర్ణమైన ఆయురారోగ్యాలు సిద్ధించాలని, ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఎల్లవేళలా అందరికీ ఉండాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు. బుధవారం వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు, వేడుకలు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబాలు అని ఈ వినాయక చవితి పర్వదినం ప్రతి ఒక్కరికీ విఘ్నాలను తొలగించి సంతోషాన్ని, ఆనందాన్ని అందించాలనీ కలెక్టర్ ఆకాంక్షించారు. గణపతి ఆశీస్సులతో పశుసంపద, వ్యవసాయం, ఉద్యాన పంటలతో సుభిక్షంగా కలకళలాడాలని కలెక్టర్‌తో పాటు ఎస్పీ అశోక్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో ఆకాంక్షించారు.

పలువురు సీఐల బదిలీ

కడప క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండురోజుల క్రితం బద్వేలు రూరల్ నుంచి సీకేదిన్నెకు వచ్చిన నాగభూషణం సైతం ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. బదిలీ అయిన అధికారులు తక్షణమే వారి స్టేషన్లలో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ
తిమ్మారెడ్డి	అన్నమయ్య ఎస్‌బీ-2	ప్రొద్దుటూరు వన్‌టౌన్
బి.రామక్రిష్ణారెడ్డి	ప్రొద్దుటూరు వన్‌టౌన్	రిమ్స్
సీతారామిరెడ్డి	రిమ్స్	పులివెందుల
చాంద్‌బాషా	పులివెందుల	నంద్యాల
వంశీధర్	నంద్యాల	ఖాజీపేట
మోహన్	ఖాజీపేట	కడప వీఆర్
నాగభూషణం	సీకేదిన్నె	ప్రొద్దుటూరు రూరల్
బాలమద్దిలేటి	ప్రొద్దుటూరు రూరల్	సీకేదిన్నె

బార్లకోసం దరఖాస్తుల గడువు పొడిగింపు

కడప క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కొత్త బార్లకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగిస్తున్నట్లు ఎక్సైజ్ పర్యవేక్షణాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల గడువు మంగళవారం సాయంత్రం 5 గంటలకు ముగియాల్సిఉండగా.. వినాయక చవితి కారణంగా గడువు ఈ నెల 29వ తేదీకి పొడిగించామని, డ్రా 30న ఉదయం 8గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించనున్నామని తెలిపారు. బార్లకోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలెక్టర్ పేరుతో నకిలీ అకౌంట్

కడప కలెక్టరేట్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలలో నకిలీ అకౌంట్‌లను ప్రజలు నమ్మకూడదని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరో తెలియని ఒకరు తన పేరుతో ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసినట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఆ ఖాతా తనది కాదని స్పష్టం చేశారు. తన ఫొటోలు వాడి మోసం చేసేందుకు ప్రయత్నించే వారిపై చర్యలు తీసుకుంటామని, ఈవిషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనుమానస్పదంగా ఫేక్ ఐడీలతో మెసేజ్‌లు, రిక్వెస్టులు వస్తే ఆమోదించకూడదని తెలిపారు. తన పేరుతో ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రామ్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలలో నకిలీ ఐడీలు సృష్టించి మెసేజ్‌లు చేస్తే స్పందించ కూడదని తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో రెండో బహుమతి

కడప కలెక్టరేట్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ, జిల్లా నియంత్రణ శాఖ, డీఎంఅండ్ హెచ్‌ఓ శాఖల ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై నిర్వహించిన క్విజ్ పోటీల్లో జమ్మలమడుగు జూనియర్ కాలేజీ ఇంటర్ విద్యార్థి విష్ణుకాంత్‌కు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. మంగళవారం డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, అదనపు డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, జిల్లా ప్రోగ్రామ్ మేనేజరు బాస్కర్, ఇంటర్ విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు విష్ణుకాంత్‌ను అభినందించారు. జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీల అనంతరం ప్రశంసాపత్రాన్ని, బహుమతిని కలెక్టర్ చేతుల మీదుగా అందజేస్తామన్నారు.

రిమ్స్‌లో అత్యవసర విభాగ హెల్ప్‌లైన్

కడప సెవెన్‌రోడ్స్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో అత్యవసర విభాగం క్యాజువాలిటీ హెల్ప్‌లైన్ నెంబర్ 08562-225413ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా సర్వజన ఆసుపత్రి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎవరైనా ప్రమాదం జరిగినా, అత్యవసర వైద్య సేవలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పొందాలన్నా ఈ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ముందుగానే తెలిపితే వారు వచ్చేలోపు వైద్య పరికరాలు సదుపాయాలతో సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. ఈ ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ నెంబర్ 24/7 అందుబాటులో ఉంటుందన్నారు.

వసూల్‌రాజాలపై విజిలెన్స్ విచారణ

● ట్రాన్స్‌ఫార్మర్ పెట్టని భారీ భవంతి పరిశీలన

ప్రొద్దుటూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో కొందరు అధికారులు, సిబ్బంది కొత్తమీటర్లు బిగించడానికి వసూళ్లకు పాల్పడుతుండటంపై విజిలెన్సు అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. ఈనెల 9వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'విద్యుత్ శాఖలో వసూల్ రాజాలు' అనే కథనానికి స్పందించిన ఏపీఎస్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఆ మేరకు విజిలెన్సు ఎస్ఐ హుస్సేన్ మరో ఇద్దరు కానిస్టేబుళ్ల మీటర్లకు ముడుపుల చెల్లింపులపై బాధితులను విచారించారు. విద్యుత్ శాఖలోని ఓ లైన్‌మన్ మూడు కొత్త మీటర్లు బిగించాలంటే రూ.30వేలు డిమాండ్ చేశాడు. ఈ విషయంలో డివిజన్ ఈఈ సదరు లైన్‌మన్‌ను పిలిపించి మందలించి మీటర్లు బిగించమని ఆదేశించినట్లు విజిలెన్సు అధికారుల విచారణలో తేలింది. అలాగే వెంకటేశ్వర్ల పేటలో ఓ భారీ భవంతికి 50 కిలోవాట్స్ లోడ్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ బిగించకుండా భవన యజమాని నుంచి ముడుపులుతీసుకొని లైన్‌మన్‌తో సహా మరికొందరు అధికారులు 9 మీటర్లు బిగించారు. ఈ భవనాన్ని కూడా విజిలెన్సు అధికారులు పరిశీలించారు. వాటన్నింటిపై సంబంధిత ఏఈ, డీఈలు నివేదిక ఇవ్వాలని కోరామని ఎస్ఐ హుస్సేన్ తెలిపారు. బాధితులతోపాటు సంబంధిత ఏఈ డీఈల నివేదికలను ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులను అందజేస్తామని తదుపరి చర్యలుంటాయని తెలిపారు.

పాలిగ్రాఫ్ టెస్టుకు అనుమానితుల అంగీకారం

● బాలిక హత్య కేసులో చలనం

జమ్మలమడుగు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గండికోటలో బాలిక హత్య కేసుకు సంబంధించిన అనుమానితులు పాలిగ్రాఫ్ టెస్ట్‌కు మంగళవారం జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అంగీకరించారని పోలీసులు తెలిపారు. ప్రొద్దుటూరులో ఇంటర్మీడియట్ చదువుతున్న ఎర్రగుంట్ల మండలం హనుమనగుత్తికి చెందిన బాలిక జూలై 14వ తేదీన గండికోటలో రంగనాథ స్వామి దేవాలయం వెనుక హత్యకు గురైంది. ఈ విషయం 15వ తేదీ వెలుగులోకి వచ్చింది. వెంటనే పోలీసు అధికారులు, ఎస్పీ అశోక్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆరోజు నుంచి ఇప్పటి వరకు గండికోట హత్య కేసు నిందితుల విషయంలో విచారణ జరుగుతూనే ఉంది. హత్యకేసు గండికోట రహస్యంగానే మారిందని పలువురు చెప్పుకోవడం విశేషం. ఈ విషయంలో కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్, ఇతర అధికారులు గండికోటను సందర్శించారు. ఇటీవల జమ్మలమడుగు పోలీసు అధికారులు బాలిక హత్యలో కుటుంబసభ్యుల పాత్రపై అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు బాలిక కుటుంబ సభ్యులకు నోటీసులు ఇచ్చారు. అలాగే ప్రియుడికి నోటీసులు అందించారు. ఈ క్రమంలో కోర్టు ఆదేశాల మేరకు మంగళవారం బాలిక కుటుంబ సభ్యుల్లో ఇద్దరు, ప్రియుడు కోర్టుకు హాజరయ్యారు. కోర్టులో పాలిగ్రాఫ్ టెస్ట్‌కు వీరు అంగీకరించారని జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేశ్‌బాబు తెలిపారు. ఈ టెస్టుకు వీరు ఎప్పుడు వెళ్లాలనేది కోర్టు ప్రకటిస్తుంది.

క్రీడా మాస్టారు....

● రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ
● క్రీడాకారులకు.. నైపుణ్య శిక్షణ
● ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న వైనం

7

నకిలీ బంగారంతో టోకరా

● రూ.3.76 లక్షలతో ఉడాయించిన జంట



బంగారంలానే వున్న నకిలీ బ్రాస్‌లెట్



బ్రాస్‌లెట్‌ను కుదువ పెట్టిన మహిళ



బ్రాస్‌లెట్‌ను అమ్మిన వ్యక్తి

రైల్వేకోడూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రెండు బంగారు దుకాణాల్లో నకిలీ బంగారాన్ని అమ్మి రూ.3.76 లక్షలతో ఓ జంట ఉడాయించిన సంఘటన రైల్వేకోడూరులో మంగళవారం వెలుగుచూసింది. పట్టణంలోని ప్రధాన దారిలో ఉన్న ఓ బంగారు దుకాణానికి ఓ మహిళ బ్రాస్‌లెట్ తీసుకెళ్లి దుకాణదారుడికి ఇచ్చి కుదువ పెట్టుకుని డబ్బులు కావాలని అడిగింది. దీంతో దుకాణదారుడు బ్రాస్‌లెట్ (24 గ్రాములు) కు వెనుక భాగంలో 916 నెంబరును పరిశీలించి నిర్ధారణకు వచ్చి మహిళకు రూ.1.16 లక్షలు నగదు ఇచ్చి కుదువ పెట్టుకున్నాడు. అదే విధంగా ఓ వ్యక్తి మార్కెట్ వీధిలో ఉన్న ఓ బంగారు దుకాణానికి వెళ్లి బ్రాస్‌లెట్ అమ్ముతానని తెలిపాడు. దానిని పరిశీలించిన దుకాణం యజమాని రూ.2.16 లక్షల నగదు ఇచ్చాడు. ఇరువురు తిరుపతి అడ్రస్ ఇచ్చారని బాధితులు తెలిపారు. ఆ రెండు బ్రాస్‌లెట్లు బంగారం కాదని తేలింది. బంగారం వ్యాపారం చేసే వారే మోసపోయారంటే మామూలు వ్యక్తులు ఇంకెంత మోసపోతారని మార్కెట్ వీధిలో అందరూ అనుకుంటున్నారు. బంగారం నకిలీ అని తెలుసుకున్న దుకాణ యజమానులు మోసం చేసిన జంటను పట్టుకోవడానికి అడ్రస్ వెతుక్కుంటూ తిరుపతికి వెళ్లారు. అయితే వారు ఇచ్చిన అడ్రస్ తప్పుగా ఉందని తెలుసుకున్నారు. ఏమీ చేయలేక తిరుగుముఖం పట్టారు. వేర్వేరుగా బ్రాస్‌లెట్లను తీసుకుని వచ్చిన ఇరువురు భార్యాభర్తలని చెప్పుకుంటున్నారు. ఒక బాధితుడు మాత్రం పోలీసులకు ఫిర్యాదు చేశాడని ఎస్ఐ ఎల్వీ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సంఘటనపై అన్ని కోణాల్లో విచారిస్తామని తెలిపారు.

కలమల్ల ఆలయ భూములపై పరిశీలన

● అందరి వాదనలు విన్న కలెక్టర్



కలమల్లలో శిలా ఫలకాన్ని ఫొటో తీసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, చిత్రంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

ఎర్రగుంట్ల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): చాలా కాలంగా వివాదాస్పదంగా ఉన్న కలమల్ల సిద్ధేశ్వరస్వామి ఆలయ భూములపై కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఇటీవల త్రిసభ్య కమిటీ అసలైన సిద్ధేశ్వరస్వామి ఆలయం పాతకల్లకు చెందినదిగా నివేదిక ఇచ్చింది. దీంతో ఇప్పటి వరకు ఆలయ భూములను అనుభవిస్తున్న సిద్ధేశ్వరస్వామి కమిటీవారు, కొందరు గ్రామస్థులు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే, ఎస్పీ, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ ఇక్కడ పర్యటించారు. ముందుగా పాత కలమల్లలో ఉన్న ఆలయాలను పరిశీ లించారు. అక్కడ తెలుగు శాసనాలను పరిశీ లించి వాటి చరిత్రను అడిగి తెలుసుకు న్నారు. అక్కడ ఉన్న శిలా ఫలకాలను ఆయన ఫొటోలు తీసుకున్నారు. త్రిసభ్య కమిటీకి చెందిన ఆర్డీవో సాయిశ్రీ, ఎండో మెంట్ ఏఈ మల్లికార్జున ప్రసాద్‌ను ప్రశ్నిం చారు. ఆలయంలోకి వెళ్లి నిర్మాణాలను, మ్యాప్‌ను పరిశీలించారు. ఆలయ చరిత్రకు సంబంధించి అడిగితెలుసుకున్నారు. స్థానిక వృద్ధులతో ఆలయం గురించి ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇరువర్గాల వారి వాదనలు విన్నామని, అన్ని విషయాలు పూర్తిగా పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శోభన్‌బాబు, ఈవో జగన్‌మోహన్‌రెడ్డి, డీఎస్పీ వేంకటేశ్వరావు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పెద్దమ్మగుడిని సందర్శించిన కలెక్టర్, ఎస్పీ

పొట్లదుర్తిలోని పెద్దమ్మగుడిలో వివాదాస్పదంగా ఉన్న ప్రహరీ నిర్మాణం పనులపై కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పరిశీలించారు. ఇక్కడ ఎంపీ సీఎం రమేశ్ నిధుల నుంచి రూ.కోటితో ప్రహరీగోడ నిర్మాణంతో పాటు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. దీనిని స్థానికులు కొందరు అడ్డుకోవడంతో పనులు ఆగిపోయాయి. ఈ విషయంపై కలెక్టర్ దృష్టిసారించారు. వివాదానికి కారణమైన విషయాలను ఆర్డీవో, ఎండోమెంట్ అసిస్టంట్ కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. మ్యాప్ లను పరిశీలించారు. టీడీపీ సీనియర్ నాయ కుడు సీఎం సురేశ్‌నాయుడు, సీఎం రాజేశ్ తదితరులతో మాట్లాడారు. ఆలయంలో సమావేశమై స్థానికులతో మాట్లాడారు. పూర్తి విషయాలను పరిగణలోకి తీసుకుని సమస్యను పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

15 రోజుల్లో నివేదిక ఇవ్వండి

కడప కలెక్టరేట్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఎస్సీలను ఓటు వేయనివ్వకుండా అడ్డుకున్నారని పులివెందుల మండలం ఎర్రబల్లి గ్రామానికి చెందిన కె.ఓబులేశు జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఈ నెల 21 వతేదీన ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి 15 రోజుల్లో నివేదిక అందజేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి జాతీయ ఎస్సీ కమిషన్ కార్యాలయం నుంచి ఆదేశాలు జారీచేశారు. నిర్ణీత సమయంలోగా సమాధానం అందకపోతే కలెక్టర్ స్వయంగా కమిషన్ ఎదుట హాజరయ్యేలా సమన్లు జారీ చేయాల్సి వస్తుందని జాతీయ ఎస్సీ కమిషన్ అధికారి ప్రభాత్ మోహన్ ఠాకూర్ జారీ పేర్కొన్నారు.

మట్టి గణపతే.. మహాగణపతి...

- మట్టి విగ్రహాలనే పూజిద్దాం
- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో అనేక అనర్థాలు

గాలివీడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అనాదిగా వస్తున్న ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా మట్టి ప్రతిమలనే పూజించాలని పలువురు పెద్దలు అంటున్నారు. కానీ ఎన్నో ఆకృతుల్లో హానికరమైన రసాయన రంగులతో వినాయక ప్రతిమలు అందుబాటులోకి రావడంతో యువత, ప్రజలు వాటికి ఆకర్షితులవుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు పర్యావరణానికి హానికరమని తెలిసినప్పటికీ హంగులు, ఆర్భాటాల కోసం నేడు వాటినే మండపాల్లో ఏర్పాటు చేస్తున్నారు. మట్టి వినాయకులనే పూజించేలా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, యువత ఈ దిశగా ఆలోచన చేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో ముప్పు

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహాలు చెరువులు, నదుల్లో నిమజ్జనం చేసినా అవి త్వరగా కరగవు. ఈ ప్రతిమల్లో జిప్సం, గంధకం, మెగ్నీషియం పాదరసం, సీసం, కాడ్మియం, ఆర్గానిక్స్, కార్బన్ వంటి రసాయనాలు ఉంటాయి. వీటికి పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగిన పశువులకు జీర్ణకోశ వ్యవస్థ దెబ్బతింటుంది. రసాయనాలు కలిపిన నీటి వల్ల చర్మవ్యాధులు వస్తాయి.



మట్టి విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న దృశ్యం



శరీరంలో నరాలపై ప్రభావం చూపి క్యాన్సర్ వ్యాధికి దారితీస్తుంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ నీటిలో కరగడానికి కొన్ని నెలల సమయం పడుతుంది. నీరు, నేల, గాలి అన్నింటిపై కాలుష్య ప్రభావం పడుతుంది. రసాయన రంగులు కలిపిన నీరు పంట పొలాలకు అందించడం ద్వారా దిగుబడులు తగ్గడమే కాకుండా ఆహార ఉత్పత్తులు కలుషితమవుతాయి.

జంతుజాలానికి ముప్పు



వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి ప్రతిమను పూజించడం అన్ని విధాలా శ్రేయస్కరం. రసాయనాలతో తయారు చేసే విగ్రహాలతో మానవాళికి కాదు జంతు జలానికి ఎంతో ముప్పు. కాలుష్యానికి కారణమయ్యే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహాలను కాకుండా మట్టి వినాయక ప్రతిమలనే మండపాల్లో ప్రతిష్ఠించుకోవాలి.

- డాక్టర్ రామచంద్రారెడ్డి, గాలివీడు

అవగాహన కల్పిస్తున్నాం



మట్టి వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించి పూజలు చేసుకోవాలని ఎన్నో ఏళ్లుగా అవగాహన కల్పిస్తున్నాం. మా సంస్థ ద్వారా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశాం.

- ఆర్యశంకర్, సేవాభావం సంస్థ వ్యవస్థాపకుడు

మట్టి వినాయకులనే ప్రతిష్ఠిద్దాం



మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేలా యువతను ప్రోత్సాహించాలి. రకరకాల రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహాలు ఆకర్షణీయంగా కనిపించవచ్చు కానీ వాటి వల్ల చాలా ముప్పు ఉంటుంది. మట్టి ప్రతిమలతో ఉత్సవాలను చేసుకుందాం.

- ఉదయ్‌కుమార్, గుండ్లచెరువు

గంజాయి మొక్కలు తొలగింపు



గంజాయి మొక్కల పెంపకంపై విచారణ చేస్తున్న సీఐ వరప్రసాద్

సుండుపల్లె, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి మొక్కలు పెంచుతున్నారని వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి గంజాయి మొక్కలు తొలగించినట్లు రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ తెలిపారు. మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ ఆరోగ్యపురం బిడికికి చెందిన మూడే సుబ్బరాంనాయక్ తన ఇంటి పరిసరాల్లో గంజాయి మొక్కలను పెంచుతున్నాడన్న సమాచారం వచ్చిందన్నారు. రాయచోటి ఎక్సైజ్, రెవెన్యూ అధికారులతో వెళ్లి మూడే సుబ్బరాంనాయక్ ఇంటి పరిసరాల్లో పెంచుకుంటున్న సుమారు 10 గంజాయి మొక్కలను తొలగించి అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గంజాయి మొక్కలు పెంచడం, సరఫరా చేయడం, గంజాయి వినియోగం చట్టరీత్యా నేరమని, అలా ఎవరు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్థులను కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల కొరత రానివ్వద్దు

జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శివనారాయణ

నిమ్మనపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువుల కొరత లేకుండా చూసే బాధ్యత అధికారులదేనని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయపరపతి కార్యాలయంలో అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ రైతులకు అందించే ఎరువుల కొరత లేదని అయితే రైతులు నానో యూరియా, డీఏపీలను వాడితే వరి పంటతో పాటు ఇతర పంటలకు పిచికారీ చేసేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన నిపుణులు ఉన్నారని తెలిపారు.

నానో ఎరువు బాటిల్‌లో లిక్విడ్ రూపంలో వస్తుందని ఇది పిచికారీ చేస్తే యూరియా కంటే ఎక్కువగా పనిచేసి అధిక పంటలు పండుతాయని తెలిపారు. నానో లిక్విడ్‌ను పంటలకు పిచికారీ చేసేందుకు ఎకరాకు కేవలం రూ. 300 మాత్రమే ఖర్చు అవుతుందని తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేపడితే ఎరువులతో పని వుండదని తెలిపారు. ప్రస్తుతం ప్రైవేటు ఏజన్సీలకు 30 శాతం ప్రభుత్వానికి 70 శాతం ఎరువులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రైవేటు ఎరువుల దుకాణ దారుల అధిక ధరలకు విక్రయిస్తే వారి లైసెన్స్ రద్దు చేసి కఠిన చర్యలు చేపట్టన్నుట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ రుద్రరమేష్, ఏఓ మంజుల, సీఈవో హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


చిట్వేలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం విజిలెన్స్ టీమ్ మురళీకృష్ణ (ఫారెస్ట్ రేంజ్ అధికారి) ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువులను, స్టాక్ రిజిస్టర్లను, బిల్ బుక్స్‌ను, గోడౌన్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువులను అధిక ధరలకు అమ్మినా, నాణ్యతలేని, అనుమతులు లేని ఎరువులను అమ్మినా, అక్రమంగా నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి దుకాణంలో అన్ని రికార్డులను, బిల్‌బుక్స్‌ను నిర్వహించాలని ఆదేశించారు. మన గ్రోమోర్, లక్ష్మీశ్రీనివాస, పరస్పర సహకార సంఘం, వెంకటసాయి ఆగ్రో ట్రేడర్స్ దుకాణాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుధాకర్, విజిలెన్స్ కానిస్టేబుల్ టిప్పుసుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడికి రిమాండ్

తంబళ్లపల్లె ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు. పెందూరివారిపల్లె వాసి పి.చంద్రశేఖర్ సోమవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు డ్రైవర్ రామచంద్రారెడ్డిపై దాడికి దిగాడు. బాధితుడి ఫిర్యాదుపై చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు


ఆదర్శ పాఠశాల విద్యార్థిని



మధులత

పుల్లంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మధులత రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ లీలా శ్రీహరి తెలిపారు. పులివెందులలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, సిబ్బంది మధులత, పీడీ నీలకంఠరావులు విద్యార్థినిని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



విజయ్ (ఫైల్‌ఫొటో)

చిన్నమండెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై కస్తూర్బా స్కూల్ ఎదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని కంచపు విజయ్ (20) మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. వివరాల్లోకెళ్తే.. సంబేపల్లె మండలానికి చెందిన మృతుడు చిన్నమండెం నుంచి రాయచోటి వైపు వెళ్తుండగా.. పడమటికోన గ్రామానికి చెందిన యానిమేటర్ శ్రీధర్ ఎంపీడీవో కార్యాలయం నుంచి వెలుగు కార్యాలయానికి మంగళవారం మధ్యాహ్నం కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై వస్తున్నాడు. కాగా శ్రీధర్ వెలుగు కార్యాలయానికి క్రాస్ అవుతుండగా విజయ్ ఢీకొన్నాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన విజయ్‌ను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కడపకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించినట్లు వారి మిత్రులు తెలియజేశారు. దీనిపై ఎస్‌ఐ సుధాకర్ వివరణ కోరగా... ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.

ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లపై ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న పీటీఎం శివప్రసాద్

మదనపల్లె, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్ల ఉద్యమం బలోపేతం చేద్దామని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ పిలుపునిచ్చారు. దేశంలో మెజారిటీ ప్రజలు లబ్ధి పొందుతున్న రిజర్వేషన్లకు ప్రైవేటు రంగాలు మంగళం పాడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పట్టణంలో మంగళవారం జరిగిన వీసీకే, బాస్ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2012లో ఎస్.ఆర్.మీనర్ కమిషనర్ ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు అమలుకు సిఫార్సు చేసి, డ్రాఫ్ట్ బిల్లు కూడా తీసుకొచ్చిందని గుర్తు చేశారు. వీటి అమలుకు చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. రిజర్వేషన్ వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల ఆవశ్యకతను తెలిపి, బలమైన ఉద్యమం నిర్మించేందుకు వీసీకే శ్రీకారం చుట్టిందన్నారు. సమావేశంలో బాస్ నేతలు ముత్యాల మోహన్, నీరుగట్టి రమణ, బయన్న, రవిశంకర్, తెట్టు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడు మృతి



కోటప్ప ఆచారి మృతదేహం

కలకడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో లారీ ఢీకొని వృద్ధుడు కోటప్ప ఆచారి (80) మృతి చెందినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు గుడిబండ పంచాయతీ గొల్లపల్లెకు చెందిన కోటప్ప ఆచారి సంతలోకి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా పీలేరు వైపు నుంచి రాయచోటికి వెళుతున్న లారీ ఢీకొందన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని చికిత్స కోసం 108లో మహల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి



విద్యార్థిని అభినందిస్తున్న జిల్లా వైద్యశాఖ అధికారి

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో మదనపల్లిలో కృష్ణారెడ్డి సిద్ధార్థ కాలేజ్ విద్యార్థి కుమారి నూల అంజుమ్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందినట్లు జిల్లా ఆరోగ్య శాఖాధికారి లక్ష్మీనరసయ్య తెలిపారు. జిల్లా స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ కాంపిటీషన్‌లో ప్రథమ బహుమతి అందుకొన్నట్లు తెలియజేశారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్‌బాబు, జిల్లా క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ భాస్కర్, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ అధికారి డాక్టర్ రవి ఈ సందర్భంగా అభినందించారు. వీరికి సంబంధించిన ప్రశంసా పత్రాన్ని బహుమతి జాతీయ స్థాయి పోటీల అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా అందిస్తామని తెలిపారు.

పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



పూర్ణాహుతి చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిశాయి. ఈనెల 24 నుంచి ఆలయంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. చివరి రోజు మంగళవారం ఉదయం మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన కుంభప్రోక్షణ నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, అధికారులు, అర్చకులు వీణరాఘవాచార్యులు, శ్రావణ్‌కుమార్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వండి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుంచి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు జారీ చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు 923 దరఖాస్తులు అందగా సింగిల్ డెస్క్ విధానంలో వాటిలో 845 పరిశ్రమలకు అనుమతులు మంజూరయ్యాయని, మిగిలిన 77 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులపై నిర్దిష్ట గడువులోపల తగిన పరిష్కారం ఇవ్వాలని పర్యావరణ పరిరక్షణ, ఫ్యాక్టరీల శాఖ, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులను ఆదేశించారు. అలాగే చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి పెట్టుబడి రాయితీ, విద్యుత్, రాయితీల కింద ఉత్పాదక, సేవా రంగాల్లోని 19 యూనిట్లకు రూ.56.94 లక్షల విలువైన రాయితీలు మంజూరు చేసినట్లు కమిటీ ఆమోదం తెలిపింది. పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ పథకాల కింద లభించిన దరఖాస్తులను సంబంధిత బ్యాంకులు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో నూతన పారిశ్రామిక విధానాల అమలు విధి విధానాలను వివరించిన జనరల్ మేనేజర్, పరిశ్రమల స్థాపనకు సహకరించాల్సిందిగా అన్ని పరిశ్రమల ప్రతినిధులను కోరారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కె.కృష్ణకిశోర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, పరిశ్రమల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మదనపల్లె




మట్టి వినాయకుడి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాష పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్ ఖాన్ ఆధ్వర్యంలో సేదా ఫౌండేషన్ సభ్యులు హిందువులకు ఉచితం వినాయకుడి ప్రతిమలు, టెంకాయలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటా పఠాన్‌ఖాదర్‌ఖాన్ వినాయక చవితి సందర్భంగా 200 మందికి వినాయకుడి ప్రతిమలు, పూజా సామగ్రి పంపిణీ చేస్తుండటం అభినందనీయమన్నారు. ప్రజలందరూ చవితి పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. టీడీపీ అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేశ్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయకుడి ప్రతిమలను ప్రజలు ఉపయోగించాలన్నారు. పఠాన్ ఖాదర్‌ఖాన్ మాట్లాడుతూ తమ సేదా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 17 ఏళ్లగా వినాయకుడి ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. జనసేన నేతలు శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత, జంగాల శివరామ్, టీడీపీ నాయకులు నాదెళ్ల శివన్న, షంషీర్, నాగూర్‌వలి, ఎం.ప్రభాకర్, సుద్దిళ్ల సుధాకర్, బ్రహ్మకుమారి సేవకులు పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్ తప్పనిసరి

- జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం

రాయచోటిటౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ గౌరవ కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్కౌట్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం సూచించారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో పీయంశ్రీ (ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు, ప్రధానోపాధ్యాయులకు, యూనిట్ లీడర్లకు ఒక్కరోజు శిక్షణను ఉద్దేశించి ఈయన మాట్లాడారు. జిల్లాలో ఉన్న 39 పీయంశ్రీ పాఠశాలల్లో స్కౌట్ కార్యకలాపాల కోసం సమగ్ర శిక్ష ద్వారా కేటాయించబడిన రూ.50 వేలను నిబంధనల ప్రకారం ఖర్చు చేయాలన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి స్కౌట్ శిక్షణ దోహదపడుతుందన్నారు. స్కౌట్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాలల్లో నిర్వహించాల్సిన స్కౌట్ కార్యకలాపాల గురించి వారికి అవగాహన కలిగించారు. అనంతరం స్కౌట్‌లో శిక్షణ పూర్తి చేసిన యూనిట్ లీడర్లకు డీఈవో ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఏఎంవో షమీవుల్లా, స్కౌట్ మాస్టర్, గైడ్ కెప్టెన్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రహ్మణ్యం

అనుకున్నదే...అయింది

- కొన్ని బార్లకు బోణీ కాలేదు
- ఏఈఆర్‌టీ ఎఫెక్ట్..
- మూడు బార్లకే దరఖాస్తులు



మదనపల్లె టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మద్యం వ్యాపారులు అందరూ అనుకున్నదే అయ్యింది. వైసీపీ పాలనలో ప్రవేశపెట్టిన ఏఈఆర్‌టీ పన్నులతో కూటమి ప్రభుత్వం కూడా బార్ పాలసీ విధానాన్ని ఈసారి కూడా కొనసాగించడంతో జిల్లాలో 11 బార్లకు కేవలం 15 మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. నష్టం కలిగించే ఈ వ్యాపారం తమకు వద్దంటూ మద్యం వ్యాపారులు కనీసం దరఖాస్తులు కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో ఓపెన్ కేటగిరీ కింద 11 బార్లకు ఎక్సైజ్ అధికారులు వారం రోజుల క్రితం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆసక్తి గల వ్యాపారుల నుంచి దరఖాస్తులు తీసుకుంటామని ప్రకటించారు. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు జిల్లాలోని 11 బార్లకు గాను మొత్తం 178 మంది వారి పేర్లను ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారే కానీ కేవలం 15 మంది మాత్రమే రూ.55 లక్షలు చొప్పున డిపాజిట్, రూ.10 వేలు చొప్పున చెల్లించి పూర్తి స్థాయిలో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో రాజంపేటలోని రెండు బార్లకు, రాయచోటిలోని ఒక బార్‌కు మాత్రమే లక్కీ డ్రా నిర్వహించేందుకు పెట్టిన నిబంధన ప్రకారం నాలుగేసి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. మదనపల్లెలో ఐదు బార్లకు, పీలేరులో ఒక బార్‌కు గాను కేవలం 3 మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. దీంతో మదనపల్లె, పీలేరు బార్లకు లక్కీ డ్రా నిర్వహించే వీలులేకుండా పోయింది. రాష్ట్రంలో 840 బార్లకు నోటిఫికేషన్ జారీ చేస్తే కేవలం 56 బార్లకు మాత్రమే లక్కీ డ్రా నిర్వహించేందుకు సరిపడా దరఖాస్తులు వచ్చాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీంతో రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ నిషాంత్‌కుమార్ హడావుడిగా ఉత్తర్వులు జారీ చేశారు. బార్ల లక్కీడ్రాకు దరఖాస్తుల గడువు మరో మూడు రోజులు అంటే 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు పొడిగించారు. అప్పటికైనా బార్లకు దరఖాస్తులు వస్తాయా, రావో వేచిచూడాల్సి ఉంది.

ఏఈఆర్‌టీ ఎఫెక్ట్

బార్ల పాలసీ ప్రకారం అదనపు రిటైల్ ఎక్సైజ్ పన్నులు 15 శాతం చెల్లించాలి. అంటే మద్యం దుకాణాలకు సరఫరా చేసే మద్యం ధరల కన్నా, బార్లకు సరఫరా చేసే మద్యం ధరలు 15 శాతం ఎక్కువగా ఉంటాయి. దీంతో బార్ల యజమానులకు ఆశించిన స్థాయిలో వ్యాపారాలు జరగవు, లాభాలు రావు. ఈ విషయమై అప్రమత్తమైన మద్యం వ్యాపారులు చాలామంది బార్లు దక్కించుకోవడానికి ముందుకు రాలేదని తెలుస్తోంది.

30వ తేదీ రాయచోటిలో లక్కీడ్రా

జిల్లాలో 11 బార్లకు ఇచ్చిన నోటిఫికేషన్‌తో వినాయకచవితి పండుగ రావడం, బ్యాంకులకు వరుస సెలవులు రావడంతో తక్కువ దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ చెప్పారు. ఎక్కువమంది దరఖాస్తులు చేసుకుంటేనే బార్లకు లక్కీ డ్రా నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు బార్లకు దరఖాస్తుల గడువు ఈనెల 29వ తేదీ వరకు పొడిగించామన్నారు. 30వ తేదీ ఉదయం 8 గంటలకు రాయచోటిలోని కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్లో లక్కీ డ్రా నిర్వహిస్తామని తెలిపారు.

క్రీడా మాస్టారు....

- క్రీడాకారులకు.. నైపుణ్య శిక్షణ
- ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న వైనం
- క్రీడాకారుడిగా రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ

అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యం

వ్యాయామ ఉపాధ్యాయుడిగా అంతర్జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించడమే ఏకైక లక్ష్యం. అంతేకాక జాతీయ స్థాయిలో జరిగే స్కూలుగేమ్స్ పోటీల్లో మా పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యేలా నైపుణ్య శిక్షణ ఇవ్వడం.. ఎంపికైన క్రీడాకారులు అద్భుత ప్రతిభ చాటేలా.. తీర్చిదిద్దడమే ధ్యేయం.

- బి.శివశంకర్‌రెడ్డి, పీఈటీ, గంగనపల్లె జడ్పీ హైస్కూలు





స్వర్ణ పతకం అందుకుంటున్న వ్యాయామ ఉపాధ్యాయుడు బి.శివశంకర్‌రెడ్డి

కడప స్పోర్ట్స్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మట్టిలో మాణిక్యాల్లా దాగి ఉన్న క్రీడాకారులను వెలికితీస్తూ.. వారిలో నూతన ఉత్తేజాన్ని నింపుతూ... వివిధ క్రీడా విభాగాల్లో రాణించేలా తనదైన మార్కు శిక్షణ ఇస్తున్నారు వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి. అదే విధంగా ఐదు పదుల వయసులోనూ తనలోని క్రీడాకారుడి తృష్ణను తీర్చుకుంటూ.. రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తూ పతకాలు సొంతం చేసుకుంటున్నారు.. ఆయన గురించి వివరాల్లోకి వెళితే..

పెండ్లిమర్రి మండలం గంగనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శివశంకర్‌రెడ్డి ప్రస్తుతం వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈయన కొంత మంది ఔత్సాహిక విద్యార్థినీ విద్యార్థులను ఎంపిక చేసుకుని వారికి ఇష్టమైన క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇస్తున్నారు. ఈయన 2002లో వీరపునాయునిపల్లె మండలం గంగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా చేరి సుమారు 8 సంవత్సరాల పాటు అక్కడ సేవలందించారు. సదరు పాఠశాలలోని 12 మంది విద్యార్థులను జాతీయ స్థాయిలో, మరో 40మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యేలా శిక్షణ ఇచ్చారు. 2009 నుంచి 2017 జూన్ వరకు కమలాపురం మండలం చిన్నచెప్పలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవలందిస్తూనే అక్కడి పది మంది విద్యార్థులను జాతీయ స్థాయికి, మరో 30 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యేలా తీర్చిదిద్దారు. 2017 నుంచి 2023 వరకు ముద్దనూరు మండలం ఉప్పలూరు జిల్లాపరిషత ఉన్నత పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయికి, 8 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యేలా కఠోర శిక్షణ ఇచ్చారు. ఇదంతా ఒక ఎత్తయితే ఆయనలోని క్రీడాకారుడి తృష్ణను తీర్చుకునేలా వివిధ క్రీడా విభాగాలను ఎంచుకుని విద్యార్థులతో పాటు ప్రతిరోజూ సాధన చేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ తన ప్రతిభను చాటుతున్నారు.

ఐదు పదుల వయసులో...

సాధించాలనే పట్టుదల ఉండాలే కానీ... వయస్సు బలాదూర్ అని నిరూపిస్తున్నా శివశంకరెడ్డి. ఆ కోవలో 2022లో గుంటూరు జిల్లా నంబూరులో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టరు క్రీడాపోటీల్లో పాల్గొని హైజంప్, ట్రిబుల్ జంప్ విభాగంలో బంగారు పతకాలు సాధించి తన సత్తా నిరూపించారు. 2024 మే 22, 23, 24 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదు గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన పాన్ ఇండియా జతీయ స్థాయిలో పాల్గొని లాంగ్‌జంప్, హైజంప్, ట్రిబుల్ జంప్, క్రీడావిభాగాల్లో మూడు బంగారు పతకాలు సాధించారు. తద్వారా అంతర్జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ (ఆస్ట్రేలియా)కు ఎంపికయ్యారు. 2025 ఫిబ్రవరిలో అనంతపురం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ పోటీల్లో పాల్గొని లాంగ్‌జంప్, హైజంప్ విభాగాల్లో ప్రథమ విజేతగా ట్రిబుల్‌జంప్‌లో ద్వితీయ విజేతగా నిలిచి.. జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు.

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు నలుగురు ఎంపిక



వాణి, ఇందు, త్రివేణి, వర్షిణి

కొండాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన నలుగురు బాలికలు రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 24న రాజంపేటలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో సీనియర్, సబ్‌జూనియర్ విభాగంలో మండలంలోని దత్తాపురం గ్రామానికి చెందిన జి.వాణి, లావనూరు గ్రామానికి చెందిన సి.ఇందు ఎంపికయ్యారు. అలాగే సబ్ జూనియర్ విభాగంలో తాళ్లప్రొద్దుటూరు జడ్పీహైస్కూల్ విద్యార్థులు త్రివేణి, వర్షిణిలు ఎంపికయ్యారు. వీరు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపట్ల రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ ఉపాధ్యక్షుడు శివనారాయణ రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు క్రిష్ణమూర్తి, వెంకటరమణలు హర్షం వ్యక్తం చేశారు.

తహలీల్ ఫాతెహాతో ముగిసిన ఉరుసు ఉత్సవాలు



ఉరుసు ముగింపులో దర్గా పీఠాధిపతి

కడప కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కడప అమీన్‌పీర్ దర్గా పదవ పీఠాధిపతి ఖ్వాజా సయ్యద్‌షా అమీనుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేనీ గంధమహోత్సవం గత మూడు రోజులుగా అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కాగా మంగళవారం తహలీల్ ఫాతెహాతో ఉరుసు ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉరుసు ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు హాజరై మొక్కుబడులను తీర్చుకున్నారు. ఇందులో భాగంగా అమీన్‌పీర్ దర్గా 11వ పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరీఫుల్లా హుస్సేనీ మూడు రోజులుగా దర్గా ఆవరణలో ఉచిత మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఇందులో వైద్యులు షాజహాన్, లోకనాథ్, ఇంతియాజ్, ఖాదర్‌మస్తాన్‌బి, లాల్, అబూబకర్ సిద్ధిక్ భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నిర్ణయించిన ధరకే ఎరువులు విక్రయించాలి



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

మైదుకూరు రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రమే దుకాణదారులు ఎరువులు విక్రయించాలని విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. కలెక్టర్, జిల్లా రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారుల ఆదేశాల మేరకు మైదుకూరు మండలం జీవిసత్రంలోని ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అగ్రికల్చర్, పోలీసు అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు.ఎరువుల దుకాణాలలో రికార్డులను పరిశీలించారు. రికార్డులు రాయకుండా ఉన్న యూరియా బస్తాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు చంద్రనాయక్, ఏడీఏ క్రిష్ణమూర్తి, ఏవో బాల గంగాధర్‌రెడ్డి, సీఐ రమణారెడ్డి, విజిలెన్స్ సీఐ శివన్న తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగలు అరెస్టు

- బంగారు, వెండి నగలు, నగదు స్వాధీనం





స్వాధీనం చేసుకున్న నగలు, నగదు, వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

కడప క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో పలు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. కడప డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్ఐలు రాజరాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలు వెల్లడించారు. కడప రవీంద్రనగర్‌కు చెందిన సయ్యద్ ఇర్ఫాన్, బాచారావువీధికి చెందిన షేక్ ఇబ్రహీం ఖలీలుల్లా స్నేహితులు. వీరు పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడేవారు. ఇటీవల కడప ఎన్జీవో కాలనీలోని ఓ ఇంటిలో, రవీంద్రనగర్, మురాది యాన గర్‌లె రెండు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు వీరిపై ప్రత్యేక బృందాలతో నిఘా ఉంచామని తెలిపారు. ఇరువురు దొంగలించిన డబ్బు, బంగారుతో పారిపోతున్నట్లు సమాచారం రావడంతో సీఐ ఓబులేసు ఆధ్వర్యంలో తాడిపత్రి- తిరుపతి బైపాస్‌రోడ్డులోని నానాపల్లె క్రాస్ వద్ద దాడి చేసి అరెస్టు చేశా మన్నారు. వారి వద్ద నుంచి 43 గ్రాములు బంగారు నగలు, 340 గ్రాములు వెండి, రూ.30వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

బ్రహ్మంసాగర్‌లో కాలు జారిపడి మహిళ మృతి



బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో ప్రమాదవశాత్తు కాలు జారిపడి మడక లక్ష్మి దేవి (39) అనే మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. వివరాల మేరకు... బి.మఠం మండలంలోని నరసన్నపల్లె గ్రామానికి చెందిన మడక రమణయ్య భార్య లక్ష్మీదేవి బ్రహ్మంగారిని దర్శించుకునేందుకు వచ్చారు. మంగళవారం తెల్లవారుజామున బ్రహ్మంసాగర్ వద్దకు వెళ్లి స్నానం చేసేందుకు దిగడంతో కాలు జారి నీళ్లలో పడి పోయింది. గమనించిన కుమా రుడు అక్కడున్న వారికి తెలపడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే మృతి చెందడంతో పోలీసులు మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘర్షణలో గాయపడిన యువకుడి మృతి

దువ్వూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):ఘర్షణలో గాయపడిన పాలగిరి చెన్నయ్య (29) అనే యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్ఐ వినోద్‌కుమార్ వివరాల మేరకు... మండలంలోని మదిరేపల్లె ఎస్సీ కాలనీకి చెందిన పాలగిరి చెన్నయ్య (29) అదే గ్రామానికి చెందిన ఎ.సంజీవరెడ్డి, యోనా, మనోహర్ అనే వ్యక్తులు ఈ నెల 24వ తేదీ మనేరాంపల్లి-పెద్దశింగనపల్లె మార్గమధ్యంలో మద్యం తాగేందుక వెళ్లారు. వీరంతా కలిసి కూర్చొని మద్యం తాగుతుండగా.. బాకీవిషయమై చెన్నయ్య, సంజీవరెడ్డిల మధ్య గొడవ జరిగింది. సంజీవరెడ్డి మద్యం మత్తులో చెన్నయ్యకు బైకు తగిలించగా కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితున్ని చికిత్స కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. అటు నుంచి తిరిగి ప్రొద్దుటూరుకు తరలించగా ఆస్పత్రిలో మంగళవారం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని ఎస్ఐ తెలిపారు. మృతుని తండ్రి సత్యరాజు ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసినట్లు చెప్పారు.

టీడీపీ మండల అధ్యక్షుడిపై దాడి

- పోలీసు స్టేషన్ పక్కనే ఇరువర్గాల ఘర్షణ



పోలీసు స్టేషన్ పక్కనే ఇరువర్గాలకు చెందిన వారు

పెండ్లిమర్రి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్ పక్కనే టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డిపై మంగళవారం ఉదయం అదే గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి, సాంబ శివారెడ్డి, శివారెడ్డిలు దాడి చేశారు. కోరవాండ్లపల్లెకు చెందిన యాదవులకు, దాడి చేసిన వారికి కొంత కాలం నుంచి భూసమస్య ఉంది. ఈవిషయంలో గంగిరెడ్డి జోక్యం చేసుకుంటున్నాడని కక్ష గట్టి సమయం కోసం వేచి ఉన్నారు. పోలీసు స్టేషన్ పక్కనే ఉన్న టీ దుకాణంలో గంగిరెడ్డి టీ తాగుతుండగా గమనించి దాడికి పాల్పడ్డారు. దాడి జరిగిన తరువాత పోలీసులు వచ్చి దాడి చేసిన వారిని వీఎన్‌పల్లె పోలీసు స్టేషన్ తరలించారు. మళ్లీ మధ్యాహ్నం ఇరువర్గాలవారు తమ అనుచరులను పిలిపించు కుని అదే పోలీసుస్టేషన్ పక్కలోనే రాళ్లు, కర్రలతో పరస్పరం దాడు లకు పాల్పడ్డారు. దీంతో కొంతమందికి గాయాలయ్యాయి. రెండోసారి గొడవకు పాల్పడుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడంపై పెండ్లిమర్రి గ్రామ ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి స్టేషన్‌లో సీఐ ఉండగానే ఘర్షణ జరగడం గమనార్హం. కాగా, టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి ఫిర్యాదు మేరకు 6 మందిపై కేసు నమోదు చేశామని, రెండోసారి జరిగిన గొడవలో ఇరువర్గాలకు చెందిన 18 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

డొంకుపల్లె గ్రామాన్ని ముంపులోకి తీసుకోవాలి

- కలెక్టర్‌కు గ్రామస్థుల వినతి



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న గ్రామస్థులు

కొండాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని డొంకుపల్లె గ్రామాన్ని ముంపులోకి తీసుకోవాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఎస్పీ అశోక్‌కుమార్, ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డిలతో కలిసి కలెక్టర్ డొంకుపల్లెలో పర్యటించారు. ఈసందర్భంగా గ్రామస్థులు తిమ్మాపురం చెరువు బ్యాక్‌వాటర్ గ్రామం చుట్టూ చేరిందని.. దీంతో గ్రామంలోకి వచ్చే దారులన్నీ బంద్ అయ్యాయని కలెక్టర్‌కు వివరించారు. గ్రామంలో 42కుటుంబాలు ఉన్నాయని, గ్రామం చుట్టూ నీరు చేరడం వల్ల గ్రామాన్ని ఖాళీ చేసినట్లు తెలిపారు. వెంటనే తమ గ్రామాన్ని ముంపులోకి చేర్చాలని వారు కలెక్టర్‌ను కోరారు. అదే విధంగా చిన్నపల్లె గ్రామంలో కూడా తిమ్మాపురం చెరువు బ్యాక్‌వాటర్ వస్తుండటం వల్ల తమ గ్రామాన్ని ముంపులోకి చేర్చారని, అయితే ఇంతవరకు పరిహారం రాలేదని గ్రామస్థులు వివరించారు. గెజిట్ అయిన ఇంకా పరిహారం రాలేదని, వెంటనే పరిహారం ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, డీఎస్పీ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ గురప్ప, మండల కూటమి నాయకులు శివనారాయణరెడ్డి, వైవీ నారాయణరెడ్డి, బాబురెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గండికోట నుంచి పైడిపాలెంకు నీరు నిలుపుదల

కొండాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి పైడిపాలెం రిజర్వాయిర్‌కు నీరు నిలుపుదల చేసినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 5000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాగా మంగళవారం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 10,700 క్యూసెక్కులు ఉందన్నారు. జీఎన్ఎస్ఎస్ వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 10,500 క్యూసెక్కులు, వరదనీరు 200 క్యూసెక్కులు వచ్చి చేరుతోందన్నారు. సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామని ఈఈ తెలిపారు.

ఉపాధి వనరులకు కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కు



కొప్పర్తి పారిశ్రామికవాడలో కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

సీకేదిన్నె, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి వనరుల అడ్డాగా కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కు నిలుస్తుందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి వద్ద 600 ఎకరాల్లో ఏర్పాటు అయిన మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో మంగళవారం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 2న నారా లోకేశ్ పర్యటన సందర్భంగా ఇండస్ట్రియల్ పార్కులో నూతనంగా నిర్మించిన ఎగ్జిక్యూటివ్ గెస్ట్‌హౌస్, టెక్నోడోమ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, రెడీమేడ్స్ సూట్స్ తయారు చేసే టెక్సానా ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలను, కంపెనీలలో ఉత్పత్తిని మంత్రిచే ప్రారంభించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా పరిశ్రమలను పరిశీలించి ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇండస్ట్రియల్ పార్కులో ఎల్ఈడీ మానిటర్ల ఉత్పత్తి, టెక్నోడోమ్, రెడిమేడ్ సూట్స్, తదితర ఉత్పత్తులను పరిశీలించి వాటి నాణ్యతను, మన్నికను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే చైతన్యరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కొప్పర్తి పారిశ్రామిక వాడను ఉపాధి హబ్‌గా మార్చేందుకు అన్ని రకాలుగా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో జాన్ ఇర్విన్, ఏపీఐసీసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి, ఇండస్ట్రియల్ జీఎం చాంద్‌బాష, తహసీల్దారు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన నైపుణ్యతలే అవకాశాలకు మార్గాలు : వీసీ



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టు జ్ఞాన నైపుణ్యాలను పొందినపుడే అవకాశాలను అందుకోగలుగుతామని యోగివేమన విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం రీసెంట్ అప్లికేషన్ ఆఫ్ ఫొటోనిక్ టెక్నాలజీ అనే అంశంపై ప్రత్యేక శాస్త్రీయ ఉపన్యాసం విశ్వవిద్యాలయంలోని అన్నమాచార్య సెనేట్ హాల్లో నిర్వహించారు. ఆచార్య అల్లం శ్రీనివాసరావు సైంటిఫిక్ లెక్చర్ ఇచ్చేముందు విద్యార్థుల్లో ప్రేరణ ఉపన్యాసం చేశారు. విద్యార్థులు భవిష్యత్తు కోసం ఎప్పుడు ప్లాన్ చేసుకోవాలన్నారు. తక్కువ శ్రమ ఎక్కువ ఫలితాలు కావాలని కోరుకోవద్దన్నారు. పెరుగుతున్న పోటీకి తగ్గట్లు సన్నద్ధత కాకపోతే అనుకున్న లక్ష్యాలను చేరుకోలేరని గుర్తుచేశారు. అనంతరం వీసీని ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్, ఆచార్య రఘునాథరెడ్డి సత్కరించారు. కార్య క్రమంలో ఆచార్యులు, సహాయ ఆచార్యులు, విద్యార్థులు, స్కాలర్లు పాల్గొన్నారు.

సుబ్బిరెడ్డి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

- అఖిలపక్షం నేతల డిమాండ్

కడప క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలం లింగాలదిన్నె పల్లెకు చెందిన భూమిరెడ్డి సుబ్బిరెడ్డి అనుమా నాస్పదస్థితిలో మృతి చెందిన విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం అఖిలపక్ష నాయకులు నారాయణ, సగిలి గురప్ప, రవిశంకర్‌రెడ్డి, ఎస్‌ఏ సత్తార్, సీఆర్వీ ప్రసాద్, బందెల ఓబయ్య మాట్లాడారు. ఆగస్టు 4న ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సుబ్బిరెడ్డి ప్రొద్దుటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 8వ తేదీ మృతి చెందారు. ఈసంఘటనపై బాధిత కుటుంబ సభ్యులతో కలిసి బి.మఠం పోలీసుస్టేషన్‌లో లెక్కల రమణారెడ్డి మరికొందరిపై ఫిర్యాదు చేశామని తెలిపారు. సుబ్బిరెడ్డి, లెక్కల రమణారెడ్డికి మధ్య గత కొన్ని సంవత్సరాలుగా భూమి తగాదాలు ఉన్నా యి. ఈ విషయంపై బి.మఠం పోలీసుస్టేషన్ వెళ్లి వచ్చిన తరువాత భూమిరెడ్డి సుబ్బిరెడ్డి విషద్రావణం తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్‌లో తనకు అవమానం జరిగిందని తన కుటుంబ సభ్యులతో తెలిపిన వినయాన్ని గుర్తు చేశారు. అంతేకాక సుబ్బిరెడ్డి కుమారుడు నాగిరెడ్డి చనిపోయాడని, ఈ మరణం వెనుక అనేక అనుమానాలున్నాయని తెలిపారు. పోలీసులు చట్టపరంగా చర్యలు తీసుకుని వాస్తవాలు వెలికితీయాలని కోరారు. జిల్లా ఎస్పీ స్పందించి నసమగ్ర విచారణ జరిపించి కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

ముగిసిన అమరావతి చాంపియన్‌షిప్ కప్ పోటీలు



వాలీబాల్ ఫైనల్స్‌లో తలపడుతున్న క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మూడు రోజులపాటు నిర్వహించిన అమరావతి చాంపియన్‌షిప్ కప్ రాష్ట్రస్థాయి పోటీలు మంగళవారం ముగిశాయి. పది క్రీడాంశాల్లో జరిగిన పోటీల్లో విన్నర్స్ రన్నర్స్‌కు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈనెల 29న విశాఖలో జరిగే జాతీయ క్రీడా దినోత్సవంలో విజేతలకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పతకాలు ప్రదానం చేయనున్నారు. ముగింపు కార్యక్రమంలో తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. అతి తక్కువ సమయంలో చాలెంజ్‌గా తీసుకొని మూడు రోజులుగా రాష్ట్రస్థాయి పోటీలు దిగ్విజయంగా నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో విజేతలు ఒలింపిక్, కామన్‌వెల్త్, ఏసియన్ గేమ్స్‌లో రాణించి దేశం గర్వించేలా పతకాలు సాధించాలని కోరారు. నాలుగు జోన్ల నుంచి వచ్చిన క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని, ఎస్వీయూ, మహిళా వర్శిటీలలో బస ఏర్పాటు చేశామన్నారు. రవాణా, ఇతర ఏర్పాట్లు కల్పించడంతో ఎక్కడా లోటుపాట్లు, ఫిర్యాదులు అందలేదన్నారు. తిరుపతిలో మరింత పెద్దస్థాయిలో క్రీడలు నిర్వహించుకునే అవకాశం ఈ పోటీల ద్వారా నిరూపితమైందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిషనరు మౌర్య, శాప్ డైరెక్టర్లు రజని, సంతోష్, అధికారులు కోటేశ్వరరావు, శశిధర్, బాలాజీ పాల్గొన్నారు.

జిల్లా క్రీడాకారులు విన్నర్స్, రన్నర్స్‌గా....

అథ్లెటిక్స్: పురుష విభాగంలో శ్రీకాకుళం, కాకినాడ, పల్నాడు, కడప విన్నర్స్‌గాను.. అల్లూరి సీతారామరాజు (ఏఎస్ఆర్), పల్నాడు, కడప రన్నర్స్‌గా నిలిచాయి. మహిళా విభాగంలో విజయనగరం, అనకాపల్లి, కడప విన్నర్స్‌గాను.. విజయనగరం, కాకినాడ, గుంటూరు, కడప రన్నర్స్‌గా నిలిచాయి.

షటిల్ బాడ్మింటన్: పురుష విభాగంలో సింగిల్స్, డబుల్స్ రెండింటిలోనూ కోనసీమ విన్నర్స్‌గా.. సింగిల్స్‌లో ఎన్టీఆర్, డబుల్స్‌లో పశ్చిమగోదావరి రన్నర్స్‌గా నిలిచాయి. మహిళా విభాగంలో సింగిల్స్, డబుల్స్ రెండింటిలోనూ విన్నర్స్‌గా ఎన్టీఆర్ జిల్లా నిలవగా.. రన్నర్స్‌గా సింగిల్స్‌లో కడప, డబుల్స్‌లో ఎన్టీఆర్ నిలిచాయి.

బాస్కెట్‌బాల్: పురుష విభాగంలో చిత్తూ రు, కడప.. మహిళా విభాగంలో ఏలూరు, వైజాగ్ విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయి.

వెయిట్ లిఫ్టింగ్ : పురుష విభాగంలో విన్నర్స్ వైజాగ్, అనకాపల్లి, కడప, గుంటూరు, వైజాగ్, గుంటూరు, బాపట్ల, పశ్చిమగోదావరి, కడప, కర్నూల్. మహిళా విభాగంలో విన్నర్స్ కాకినాడ, రన్నర్స్ వైజాగ్.

విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల పూజలు



కడప కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా జరిగాయి. అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల పూజలు చేసేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాయలసీమ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో మహిళా భక్తులు హాజరై పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4-30 వరకు పూజలు చేశారు.

ప్రతీ హామీ వందశాతం అమలు

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడిహామీలన్నీ వందశాతం అమలు చేసిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూడలేక వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని తెలిపారు. మంగళవారం నగరంలో జిల్లా అధ్యక్షుడు క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మెగా డీఎస్సీ ద్వారా 16347 టీచర్ పోస్టులను పారదర్శకంగా భర్తీచేయడం జరుగుతోందన్నారు. ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి రెండు, మూడు రోజుల్లో అభ్యర్థులకు పత్రాలు అందుతాయని పేర్కొన్నారు. విద్యకు సంబంధించిన నూతన ఒరవడిని తీసుకువచ్చిన ఘనత మంత్రి నారా లోకేష్‌కే దకికందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో గతం, ప్రస్తుత పాలనలో 1,96,619 డీఎస్సీ పోస్టులు భర్తీ చేశారన్నారు. ఇక పింఛన్లు రూ. 4, 6 ,10. 15వేలు చొప్పున పింఛన్లు ఇస్తున్న ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. మహిళలకు సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, అన్నదాతసుఖీభవ, తల్లికి వందనం పేరిట ఒకేసారి 67లక్షల మందికి అందజేసినట్లు పేర్కొన్నారు. వినాయక మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా అందేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుబ్బారెడ్డి, పాలకొండ్రాయుడు దేవస్థానం చైర్మన్ రెడ్డయ్య, టీడీపీ నాయకుడు మన్సూర అలీఖాన్ పాల్గొన్నారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి

కడప క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వినాయచవితి మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ రెడ్డప్ప, ఎస్ఐ తులసి నాగ ప్రసాద్ తెలిపారు.కడప తాలుకా పీఎస్ పరిధిలో వినాయక మండపాలు ఏర్పాటు చేసే సభ్యులతో మంగళవారం పోలీసుస్టేషన్‌లో సీఐ రెడ్డప్ప, ఎస్ఐ తులసినాగ ప్రసాద్ సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. అశ్లీల నృత్యాలు మండపాల సమీపంలో చేయరాదని, అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

సింహాద్రిపురం..: మండలంలో నిర్వహించే వినాయక చవితి ఉత్సవాల్లో ప్రశాంతతకు భంగం కల్గేటట్లు ప్రవర్తిస్తే కమిటీ సభ్యులు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎస్ఐ రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో ఉత్సవ కమిటీ సభ్యులకు సమావేశం నిర్వహించారు. పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లింగాల..: వినాయక చవితి పండుగ ఎవరికీ విషాదం కాకూడదని, అందరూ తగు జాగ్రత్తలు తీసుకొని సంతోషంతో జరుపుకోవాలని పులివెందుల రూరల్ సీఐ ఎన్‌వీ రమణ అన్నారు. లింగాల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు.

ట్రిపుల్‌ఐటీ ఆర్థిక అధికారిగా రమేష్

వేంపల్లె, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలోని పరిపాలన విభాగంలో మార్పులు చేశారు. ట్రిపుల్‌ఐటీ ఆర్థికశాఖ అధికారిగా ఎంఎంఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రమేష్‌ను నియమించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా వై.అరుణ్‌కుమార్‌రెడ్డిని డైరెక్టర్ నియమించారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

సీకేదిన్నె, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరం వంటిదని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. మంగళవారం పుత్తా ఎస్టేట్‌లో రూ.16,59,752 ల చెక్కులను పేదలకు పంపిణీ చేశారు.

డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించాలి

పులివెందుల రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పురుగు మందుల పిచికారీలో రైతులు డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించాలని ఏవో చెన్నారెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం ఇ.కొత్తపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మట్టి గణపతి మహాగణపతి


మట్టిగణపతులను పంపిణీ చేస్తున్న చంద్ర ఓబుళరెడ్డి (నాని)

సీకేదిన్నె, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మట్టి గణపతి మహాగణపతి అని కందుల విద్యాసంస్థల అధినేత డాక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి తెలిపారు. స్థానిక కేఎస్ఆర్ఎం కళాశాల వినాయక చవితిని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ విభాగం సివిల్‌డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీడీన్ డాక్టర్ విజయకుమార్, సివిల్‌డిపార్టుమెంట్ హెచ్ఓడీ చెన్నకేశవరెడ్డి, ఈవెంట్ కోఆర్డినేటర్ సురేష్, డిపార్టుమెంట్ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ విశ్వనాథ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి గణపతులు పర్యావరణ హితం


మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న తుంగా రమణయ్య

కడప సెవెన్ రోడ్స్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని విశ్వప్రగతిచిట్‌ఫండ్ మేనేజింగ్ డైరెక్టర్, జనసేన నాయకుడు తుంగా రమణయ్య అన్నారు. మంగళవారం విశ్వప్రగతి చిట్స్ కార్యాలయం వద్ద మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుంగా రమణయ్య మాట్లాడుతూ మట్టి విగ్రహాలతో వాయు, నీటటి కాలుష్యాన్ని పూర్తిగా నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా కడప ప్రజలకు తుంగా రమణయ్య శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్ ఫండ్ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి విగ్రహాన్ని పూజిద్దాం


మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న సుల్తాన్ బాబా

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మట్టి వినాయకుడిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదామని వికాస్ కళాశాలల సంస్థ కరస్పాండెంట్ సుల్తాన్ బాబా పేర్కొన్నారు. మంగళవారం కడప నగరం నాగరాజుపేట రామాలయం వద్ద వినాయకుడి ఉచిత మట్టి విగ్రహాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కోదండరామాలయం కమిటీ చైర్మన్ కేవీ శ్రీహర్ష, కార్యవర్గ సభ్యులు నిత్యానంద, కిరణ్‌కుమార్, బాబు,నారాయణ, అయ్యప్ప, లక్ష్మీనారాయణ, బాలాజీ,మారుతి, బుజ్జి, సతీష్, వెంకటసుబ్బయ్య,రమణ,సూరి,కుమార్, నరసయ్య, హరికుమార్ పాల్గొన్నారు.

మట్టి వినాయకుని పూజిద్దాం


మట్టి వినాయక విగ్రహాన్ని పంపిణీ చేస్తున్న వికాస్ హరికృష్ణ

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మట్టి వినాయకులను పూజిద్దాం- పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ప్రజలలో అవగాహన పెంచేందుకు పది సంవత్సరాలుగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వికాస్ స్కూల్ చైర్మన్ వికాస్ హరికృష్ణ తెలియజేశారు. మంగళవారం కడప నగరం ఐటీఐ సర్కిల్ వికాస్ పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. అలాగే జిల్లా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంలు తెలిపారు.

మట్టి విగ్రహాలను పంపిణీ చేసిన ఎస్పీ

కడప క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ఏడురోడ్ల కూడలిలో మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎస్పీ అశోక్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఏపీ మీడియా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, జనసేన నేత రమణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా కడప నగరంలో ఊరేగింపులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేశామని తెలిపారు.

పారదర్శకంగా వక్ఫ్‌భూముల గుత్త వేలం : డీఆర్వో

కడప కలెక్టరేట్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో వక్ఫ్‌భూముల గుత్త వేలం మంగళవారం ప్రశాంతంగా జరిగిందని జిల్లా రెవెన్యూఅధికారి విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. జిల్లా మైనార్టీసంక్షేమం, వక్ఫ్ అధికారి హిదయతుల్లా, వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ వసీం వక్ఫ్ భూముల గుత్త వేలం నిర్వహించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యనిర్వాహక అధికారి, రాష్ట్ర కమిటీ సభ్యుడు దావూద్ మౌలానా పర్యవేక్షించారు. వేలం కోసం నోటిఫై చేసిన 182.85 ఎకరాల భూమిలో 167.88 ఎకరాల భూమిని లీజ్‌కు ఇవ్వడం జరిగింది. ప్రొద్దుటూరు మండలంలోని తలంపూర్ గ్రామంలో మోడంపల్లి మసీదుకు చెందిన 14.97 ఎకరాలు వేలం వాయిదాపడింది. ఈ వేలంలో మొత్తం 49 మంది పాల్గొన్నారు. ఈ వేలం 8,91,000 రూపాయల అధిక ఆదాయం వచ్చిందని, ఈ వేలం పారదర్శకంగా నిర్వహించినట్లు డీఆర్వో పేర్కొన్నారు.

నిమజ్జనం సవ్యంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

కడప కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే క్రమంలో కొంతమంది యువత విచ్చలవిడిగా మద్యం తాగి దారి వెంబడి అల్లరి చేష్టలు చేసే పద్ధతికి స్వస్తిపలికేలా ప్రభుత్వం తగురీతిగా స్పందించి సవ్యంగా ముగిసేలా చూడాలని వినాయక ఉత్సవ కేంద్ర కమిటీ, బీజేపీ, వీహెచ్‌పీ ప్రతినిధులు కోరారు. ఆ మేరకు మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కమిటీ నగర అధ్యక్షుడు మునగా సతీష్‌కుమార్, బీజేపీ రాష్ట్రకార్యదర్శి బాలకృష్ణయాదవ్, వీహెచ్‌పీ నాయకులు బెస్తవేముల రామ్ మహేష్ మాట్లాడారు. వినాయకుడి విగ్రహాల నిమజ్జనం రోజున మద్యం షాపులు బంద్ చేసేలా ప్రభుత్వం తగు రీతిగా స్పందించి నిర్ణయం ప్రకటించాలని కోరారు. సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రతినిధి లెక్కల కొండారెడ్డి, బాలాజీ దేవస్థాన ఆలయ ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి చంద్రమౌళిశర్మ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా తాగునీరు సరఫరా చేయండి

పులివెందుల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీలోని పలు వార్డులలో తాగునీరు నాలుగు, ఐదు రోజులకు ఒకసారి వస్తోందని, ఈ సమస్య పరిష్కరించాలని కౌన్సిలర్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశం చైర్మన్ వరప్రసాద్ అధ్యక్షతన జరిగింది. మున్సిపాలిటీలోని పలు సమస్యలను పలువురు కౌన్సిలర్లు సభదృష్టికి తెచ్చారు. మున్సిపల్ కమిషనర్ రాముడు, వైస్ చైర్మన్‌లు వైఎస్ మనోహర్‌రెడ్డి, హఫీజుల్లా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సొసైటీ బ్యాంకులు సేవలందించాలి

కొండాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు సొసైటీ బ్యాంకులు విస్తృతంగా సేవలందించాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని తాళ్లప్రొద్దుటూరులో సొసైటీబ్యాంక్ ఛైర్మన్‌ల ప్రమాణ స్వీకారోత్సవంలో వారు పాల్గొన్నారు. కొండాపురం సొసైటీ బ్యాంక్ ఛైర్మన్‌గా నాగిరెడ్డి, మెంబర్లుగా జయరాముడు, ప్రతాప్‌రెడ్డిలచే ప్రమాణస్వీకారం చేయించారు. అలాగే తాళ్లప్రొద్దుటూరు సొసైటీ ఛైర్మన్‌గా వెంకటసుబ్బారెడ్డి, మెంబర్లుగా నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరావులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కూటమి ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి, నాయకులు అంకిరెడ్డి, రామాంజులరెడ్డి, నాగేశ్వరరెడ్డి, మాధవరెడ్డి, బాలనాగిరెడ్డి పాల్గొన్నారు.

సంపాదనలో కొంత సమాజసేవకు ఇవ్వాలి



.ప్రమాణ స్వీకారం చేస్తున్న పీఏసీఎస్ ఛైర్మన్లు

ఎర్రగుంట్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మన సంపాదనలో కనీసం ఒక శాతమైన సమాజసేవ కోసం ఖర్చుచేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సి.ఆదినారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఎర్రగుంట్ల మండలం తిప్పలూరు పీఏసీఎస్ ఛైర్మన్‌గా ఇల్లూరు బంగారుమునిరెడ్డి, సున్నపు రాళ్లపల్లె పీఏసీఎస్ ఛైర్మన్‌గా మల్లుగోపాల్‌రెడ్డిల ప్రమాణస్వీ కారోత్సవం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది మాట్లాడుతూ రాష్ట్రంలో పీ4 ఒక బృహత్తరప థకంగా అభివర్ణించారు. టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ సూపర్ సక్సెస్ అయినట్లు తెలిపారు.

పీ4కు నావంతు కృషి చేస్తా: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పీ4కు తన వంతుగా రూ.3లక్షలు ఇస్తున్నట్లు తిప్పలూరు పీఏసీఎస్ ఛైర్మన్ ఇల్లూరు బంగారుమునిరెడ్డి ప్రకటించారు. అందుకు సంబంధించిన చెక్కును ప్రమాణస్వీకార వేదికపై ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, సి.భూపేష్‌రెడ్డికి అందజేశారు.



పీ4కు రూ.3లక్షల చెక్కును ఎమ్మెల్యేకి ఇస్తున్న ఛైర్మన్ బంగారుమునిరెడ్డి.

రైతులకు మంచి సేవలందిస్తాం: తిప్పలూరు, సున్నపురాళ్లపల్లె పీఏసీఎస్ ఛైర్మన్లుగా ప్రమాణస్వీకారం చేసిన ఇల్లూరు బంగారు మునిరెడ్డి, మల్లుగోపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మంచి సేవలందిస్తామన్నారు. ఎకార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎం.మధుసూధన్‌రెడ్డి, సొసైటీ అధికారులు, డీసీసీ బ్యాంకు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కొలువుదీరిన గణనాథులు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలు ప్రారంభం కావడంతో మండపాలలో గణనాథులు కొలువుదీరారు. ఇప్పటికే నిర్వాహక కమిటీవారు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గత రెండు రోజులుగా భారీ వినాయకులను నిర్వాహకులు మినీలారీలు, ట్రాక్టర్లలో మండపాలకు తరలించి పూజలకు సిద్ధం చేశారు. ప్రొద్దుటూరు పట్టణంలోని వీధి వీధిన వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నారు. బుధవారం నుంచి మూడు రోజులు, అయిదు రోజులు, ఏడు రోజులు, 9 రోజులపాటు స్వామివారికి పూజలు నిర్వహించి నిమజ్జనం చేయనున్నారు. ఈ సందర్భంగా కొన్ని ఉత్సవ కమిటీల నిర్వాహకులు ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేయగా కొన్ని కమిటీలు భక్తులకోసం అన్నప్రసాద వినియోగం చేయనున్నారు.

జోరుగా పూజా సామగ్రి విక్రయం

వినాయక చవితి పర్వదినం పురష్కరించుకుని పూజా సామగ్రి విక్రయాలు జోరుగా సాగాయి. మంగళవారం ఉదయం నుంచి శివాలయం సెంటర్, పాత మార్కెట్, కొర్రపాడురోడ్డు, తదితర ప్రాంతాల్లో పూజా సామగ్రి విక్రయాలతో సందడిగా మారాయి. వచ్చిన భక్తులతో కోనేటి కాలువ వీధి, శివాలయం వీధులు కిక్కిరిసిపోయాయి. పండుగను పురష్కరించుకుని అధిక ధరలకు పూజా సామగ్రిని విక్రయించారు.



ప్రొద్దుటూరులో కొలువుదీరిన గణపయ్య



పూజాసామగ్రి కొనుగోలుతో జనసందడి

బద్వేలులో : వినాయక చవితి పండుగ సందర్భంగా బద్వేలు పట్టణంలో మంగళవారం నుంచే సందడి నెలకొంది. బుధవారం వినాయక చవితి పండుగ సందర్భంగా పూజా సామగ్రి కొనుగోలు కోసం వచ్చిన జనాలతో పట్టణ ప్రాంతమంతా కిటకిటలాడింది. ముఖ్యంగా పోరుమామిళ్ల రోడ్డులోని మార్కెట్ వద్ద వినాయక విగ్రహాలతో పాటు పూజా సామగ్రి కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో కిక్కిరిసిపోయింది. దీంతో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు తీవ్ర కృషి చేయాల్సి వచ్చింది..

బికోడూరులో: బికోడూరు మండల వ్యాప్తంగా ఉన్న 46 గ్రామాల్లో గణనాథుల విగ్రహాల ను ఏర్పాటు చేశారు. బద్వేలు, పోరుమామిళ్ల తయారీ కేంద్రాల నుంచి మంగళవారం గణనాధులను మండపాలలో పూజలందు కోవడానికి కొలువుదీరారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ వెంకటసురేశ్ గట్టి బందోబస్తుఏర్పాటు చేశారు.

మైదుకూరు రూరల్‌లో : వినాయక చవితి పండుగ సందర్భంగా మంగళవారం స్థానిక రాయల్ కూడలిలో పూజాసామగ్రి కొనుగోలు చేయడానికి గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలిరావడంతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. వినాయక ప్రతిమలతోపాటు పూజాసామగ్రి, వెలక్కాయలు, చెరుకు గడెలు, అరటి తోరణాలు తదితర వస్తువులను ప్రజలు కోనుగో లు చేశారు.

కాశినాయనలో: గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాల సందడి మొదలైంది. బుధవారం వినాయక చవితి ఉత్సవాల కోసం మండపాలు సిద్ధం చేశారు. పోరుమామిళ్ల పట్టణం నుంచి గణనాథులు పల్లెలకు ట్రాక్టర్లల్లో తరలి పోయారు.

మట్టి వినాయకులనే పూజించాలి : డీఎస్పీ

ప్రొద్దుటూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితం కోసం మట్టి వినాకులనే పూజించాలని డీఎస్పీ భావన, కమిషనర్ రవిచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వైఎంఆర్ కాలనీలోని గణపతి సేవాసంఘం ఆధ్వర్యంలో వెయ్యి మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ దస్తగిరి రెడ్డి, వరుణ్‌కుమార్‌రెడ్డి కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

బద్వేలుటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పర్వదినాన్ని పురష్కరించుకొని బొమ్మనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టితో తయారు చేసిన వెయ్యి వినాయక ప్రతిమలను మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, అర్బన్‌సీఐ లింగప్పలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొమ్మన విజయ్, రాము, శేఖర్‌రాయల్, బాల, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందుల్లేకుండా చూడాలి

పోరుమామిళ్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాలు ట్రాఫి క్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా మండపాలు ఏర్పాటు చేయా లని సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడుతూ మండపాల్లో డీజే ఉపయోగించకూడదని, సీసీకెమెరా లు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్‌ఐ కొండారెడ్డి, కలసపాడు ఎస్‌ఐ తిమోతి పాల్గొన్నారు.

వేగవంతంగా రోడ్డు పనులు

జమ్మలమడుగు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు- ప్రొద్దుటూరు రోడ్డులో మంగళవారం రోడ్డు పనులు వేగవంతం చేశారు. సిమెంటు రోడ్డు నెర్రలు చీలి వాహనదారులు ప్రమాదాలకు గురయ్యేవారు. ఈ సమస్యను శేషారెడ్డిపల్లి, బైపాస్‌రోడ్డులో వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి రోడ్డు పనులు చేపట్టాలని అధికారులను సూచించారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు, హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రమణారెడ్డి సేవలు ప్రశంసనీయం

కలసపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం కోస్ట్‌గార్డ్ రమణారెడ్డి చేసిన సేవ ప్రశంసనీయమని బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఇటీవల రాష్ట్రపతి మెడల్‌కు ఎంపికైన తీరప్రాంత గస్తీదళ ఉద్యోగి రమణారెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను అభినందించి శాలువ,పూలమాలలతో రితీష్‌రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, కలసపాడు ఎస్‌ఐ తిమోతి, బద్వేల్ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ఖాజారంతు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పట్టాభిరెడ్డి, ఎంపీటీసీ రమణ, సీతావెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని వినియోగించుకోండి

బద్వేలు రూరల్. ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జైలులోపల ఉన్న ఖైదీలు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం రాష్ట న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆయన బద్వేలు సబ్ జైలును సందర్శించి ఖైదీలతో వారి కేసు వివరాలు, ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. జైలు సూపరింటెండెంట్ ప్యానల్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

అట్లూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన టంగుటూరు వెంకటసుబ్బయ్యకు సీఎం సహాయనిధి రూ.55వేల చెక్కును నియోజకవర్గం సమన్వయకర్త రితీష్‌రెడ్డి ఆయన కుమారుడు సుబ్బరాయుడుకు అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న సుబ్బయ్యకు ఆసుపత్రి ఖర్చులకోసం సీఎం సహాయనిధి మంజూరు చేయడంపట్ల టీడీపీ అధ్యక్షుడు మల్లిఖార్జునరెడ్డి సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండూరు బీఎల్‌ఏ వెంకటసుబ్బయ్య ఉన్నారు.

యూరియా అందుబాటులో ఉంది

ఖాజీపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు కావాల్సినంత యూరియా అందుబాటులో ఉందని, కడప డివిజన్ ఏడీఏ విజయకుమార్ అన్నారు. ఖాజీపేటలో ఆయన మాట్లాడుతూ యూరియాను ఇష్టానుసారంగా రైతులు వినియోగించుకోకుండా అధికారుల సూచనలు పాటించాలన్నారు. ఏడీఏ నాగరాజు, ఏవో నాగార్జున, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకం తగ్గించండి

ముద్దనూరు ఆగస్టు26(ఆంధ్రజ్యోతి):రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి,సేంద్రీయ వ్యవసాయం పైన మక్కువ చూపాలని ఏవో వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధి కొలవలి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు సూచనలు చేశారు.తరువాత రైతులకు పాడి పంటల పుస్తకాలను అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

కొండాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని లావనూరు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. సింహాద్రిపురం నుంచి ఆంజనేయులు, శివకుమార్ అనే ఇద్దరు బైకులో కొండాపురం వస్తుండగా నిలబడిన ట్రాక్టర్‌ను బైక్ ఢీకొంది. దీంతో బైకులో నుంచి వారు కింద పడ్డారు. కాగా ఎదురుగా వస్తున్న కారు వారిని ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, ఇంకొకరిని తాడిపత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్టు కొండాపురం ఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు. వారు పెనుగొండకు చెందిన వారుగా సమాచారం వివరాలు తెలియాల్సి ఉంది.

వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

జమ్మలమడుగు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ మంగళవారం పీఆర్ హైస్కూలు నుంచి విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. పాఠశాల హెడ్మాస్టర్ శశికళ, ఉపాధ్యాయులు జ్యోతి, క్రిష్ణవేణమ్మ, అమీనా, కరిముల్లా, ఓబయ్య, శోభ, భారతి పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరపాలి

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : బి.మఠం దేవాలయ పరిధిలో నాలుగు సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధి పనుల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు జి.శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో మండల కార్యదర్శి శివకుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు.

పంట నమోదు చేసుకోవాలి

అట్లూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) :ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి రామక్రిష్ణ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన యాజమాన్య పద్ధతులతో వరిసాగు చేస్తే అధిక దిగుబడి పొందవచ్చాన్నారు.

పన్నులు వేయని ఇళ్లను గుర్తించండి

ప్రొద్దుటూరు , ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఇంకా పన్ను పరిధిలోకి రాని ఇళ్లను గుర్తించడంతో పాటు అదనపు అంతస్తులు కట్టుకోని పన్నులు వేయని వాటిని గుర్తించి అడిషనల్ అల్ట్రేషన్ చేయాలని మున్సిపల్ కమి షనర్ రవిచంద్రారెడ్డి సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన సచివాలయ అడ్మిన్లు, అమినిటీస్, ప్లానింగ్, శానిటరీ సెక్రటరీల సమావేశంలో మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి అండర్ అసెస్‌మెంట్లు పరిశీలించాలన్నారు. ఖాళీ స్థలాలను గుర్తించి పన్ను విధించాలన్నారు. సమావేశంలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగరాజు టీపీవో చంద్రమోహన్ ఆర్‌ఐ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

అంజన్నకు విశేషపూజలు

బద్వేలుటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణం లోని సుమిత్రానగర్‌లో వెలసిన మహాలక్ష్మీ గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి, అభయాంజనేయస్వామి దేవాలయంలో బాద్రపద మాసం పురష్క రించుకొని మంగళవారం ఆలయంలో ఆంజనేయ స్వామికి ఆలయ అర్చకులు ఆకు పూజ, అర్చనల తోపాటు విశేష పూజలను నిర్వహించారు. ఆలయకమిటీ భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.